

టైగర్‌కు మానవుల వర్ణం చేసికోటం అంత బాగ చేతకాదు. అది కొన్ని కొన్ని తనకు సుపరిచిత మైన మాటలను విని అర్థం చేసికోగలదు. "కమ్ హియర్ టైగర్" "హలో టైగర్" "ఇజా టైగర్" వంటి మాటలు దానికి సుపరిచితాలు. 'కమ్ హియర్ టైగర్" అన్నప్పుడు పడుకున్నదల్లా ఎగిరి తోకాడించుకుంటూ పిలిచిన వాళ్ళ దగ్గరకి వచ్చేది. అయితే దాని సంగతి తెలిసిన ఇతరు లెవ్వరూ పిలవటానికి సాహసించరు. అది సుపరిచితమైన కంఠాల్ని గుర్తుపట్టి దగ్గరకొచ్చి నిల్చుంటుంది. ఇతరులు పిలిచారా వాళ్ళ అంతు చూస్తుంది. అలా ఈ "రాక్షసి కుక్క" చేతిలో అనుభవంపొందిన వాళ్ళు చాలమంది వున్నారు

దాని జీవితంలో ఇంతవరకు ప్రతి అమూల్య క్షణం ఇక్కడే ఈ ఇళ్ళమధ్యనే గడిచిపోయింది. ఇక ముందుకూడ ఇక్కడే గడపాలని దాని ఆశ. అది ఇక్కడే పుట్టి పెరిగింది. దాని తలితండ్రు లెవరో తెలియదు. అది పుట్టింది ఇంజనీరు గారింట్లో. అది పుట్టగానే గోధుమరంగుతో నిగనిగలాడే దాన్ని చూసి ఎవరో 'టైగర్' అని నామకరణం చేశారు. అదిదాని సార్థక నామమైంది. పెరిగింది వారి ఉప్పు తిని. అందుచేత దాని రక్తంలో వారి ఉప్పు కలిసిపోయింది. అదే విశ్వాసమై ఇప్పటికీ దాని రక్తనాళాల్లో ప్రవహిస్తూనే ఉంది.

ఇంజనీర్‌గారి కుమార రత్నాలు 'కమాన్ టైగర్' అని పిలిచినప్పుడల్లా చెంగున ఎగిరి దగ్గరకు వెళ్ళేది. వాళ్ళు సరదాగా పిలిచినప్పుడు అది సరదాగా ఉండేది. ఒక్కొక్కప్పుడు సరదాగా కోపం తెచ్చుకునేది. వాళ్ళు పిలవగానే, తను మోస పోయి పిలవగానే వెళ్ళానని అనుకోవాలని దాని వూహ. అలా అనుకుని అది నవ్వుకునేది. ఈ పిచ్చి మానవులు ఎప్పుడు తెలివిన బడతారా అని ఆలో చించేది.

ఇంజనీరుగారి కొడుకులు, కూతుళ్ళు అలా ఎన్నోసార్లు దాన్ని పిలిచేవాళ్ళు. వాళ్ళ దగ్గర పెట్టటానికి ఏమీ లేవని తెలిసినా కావాలని ముందు రెండు కాళ్ళు ఎత్తి వాళ్ళ వంక చూసేది. అదోవిధమైన ధ్వని చేస్తూ మొరిగేది. ముందు రెండు కాళ్ళతో వాళ్ళ చేతుల్ని తడిమేది. వాళ్ళ జేబుల్లో కూడా ఉంటుందని తెలుసు దానికి. జేబులవంక కూడ చూసేది. కుర్చీ చుట్టూ తోకా డించుకొంటూ తిరిగేది. క్రింద రెండు కాళ్ళమీద నిల్చుని ముందు కాళ్ళను పైకి క్రిందకి ఆడించేది. అప్పుడు దాని గొంతులో నుండి ఆనందంతో కూడిన అరుపు వెలువడేది. దాని గొంతులో నాదం జగద్వ్యాప్తమయ్యేది

అది సాధారణంగా ఇంటిని విడిచి ఎక్కడికి వెళ్ళేది కాదు. ఈ పిచ్చి మానవుల జాగ్రత్తమీద దానికి నమ్మకంలేదు. ఎప్పుడైనా సాయంకాలం పూట ఒకసారి అలా ఎదురుగుండా ఉన్న కమీష నరుగారింటికి, లేదా ప్రక్కనే ఉన్న డాక్టర్‌గా రింటికి పోతూఉండేది. డాక్టర్‌గారి కుక్క టామీకి టైగరంటే ఎక్కడలేని భయం. అయితే టైగర్ దాన్ని ఎప్పుడూ ఏమీ అనలేదు. పైపెచ్చు దాన్ని చాల స్నేహభావంతో చూసేది. అది ఏమీ తెలియని అమాయికపు పిల్ల అని టైగర్ భావం. పాపం, ఏమీ తెలియనిది. ఎట్లా బ్రతుకుతుందో" అని నిట్టూర్చేది.

కమీషనర్‌గారి భార్య అంటే దానికి ఓ విధ మైన యిష్టం. అది గౌరవం కూడ కావచ్చు దానికి కారణం లేకపోలేదు. ఆవిడ దానికి, తమ కుక్క రాణితో పాటు ఆదరంతో అన్నం పెట్టేది ప్రేమగా 'టైగర్' అని పిలిచేది. తనమీద సాను భూతి చూపే వ్యక్తిమీద ఎవరికి గౌరవముండదు? అంచేత కమీషనర్‌గారి భార్య వాకిట్లో ఎప్పుడు కనిపించినా అది తోకాడిస్తూ దగ్గరకు వచ్చేది. ఆవిడ్ని తన భాషలో పలకరించేది. ఆవిడ వేసే ప్రశ్నలకు తనకర్థమైనట్లే జవాబులు చెప్పేది ఎప్పుడైనా ప్రక్కనేవున్న గ్రౌండ్‌లో రాణితో పాటు తిరిగి వచ్చేది. విశ్వాసం ప్రకటించటం దాని జాతి లక్షణం.

ఈ చుట్టుప్రక్కల రాజ్యానికి అది మకుటం లేని రాజు. దానికి ఎదురు తిరిగి బ్రతుకగల కుక్క ఈ ప్రాంతంలో లేదు. అది ఎలాంటి దురా క్రమణని సహించదు. దాని పరాక్రమాన్ని చవి చూసిన శునకాలు ఎన్నో వున్నాయి. అందుచేత సాధారణంగా ఈ ప్రాంతానికి మరో శునకం రాదు. దాని క్రూర కరాళ దంష్ట్రాలలోపడి నెత్తురు కారే దేహంతో ఎదుగెత్తటం వాటి కిష్టం లేదు. ఒక వేళ ఏదైనా క్రొత్త కుక్క ఈ ప్రాంతానికి వద్దామనుకున్నా అనుభవం పొందిన కుక్కలు వాటికా విషయం చెప్పి ఆ ప్రయత్నంనుండి విర మింప చేసేవి. దాని అనుగ్రహం పొంది కొలువులో చేరిన కుక్కలు బహుకొద్ది. దాని విశ్వాసాన్ని చూరగొన్న కుక్కలు రెండే రెండు. కమీషనర్‌గారి కుక్క రాణి. డాక్టర్‌గారి కుక్క టామి. రాణి మరీ ప్రాణప్రదమైంది తనకీ రాణికి ఉన్న ఈ "స్నేహాన్ని" అది అక్షరాలా ఆచరణలో పెట్టింది. కమీషనర్‌గారిని, ఇంజనీర్‌గారితో సమానంగా గౌర వించింది. ఆమాటకు వస్తే అది ఇంకా ఎక్కువగా కమీషనర్‌గారిని ప్రేమించింది. కమీషనర్‌గారి పిల్లలు గ్రౌండులో క్రికెట్ ఆడుతుంటే అది రాణితో సహా వారిని వెంబడించేది వారికి రక్షణగా వారి చుట్టూ తిరిగేది. మరో కుక్క కనిపిస్తే మాత్రం దాన్ని వూరి పొలిమేరల దాకా తరిమి వచ్చేది కాని లేకపోతే ఆ ప్రదేశాన్ని విడిచేది కాదు. ఈ విషయంలో రాణి దానితో సహకరించేది. రాణిని మరో కుక్క కన్నెత్తి చూస్తే సహించేది కాదు రాణిమీద సర్వాధికారాలు తనవైనట్లు ప్రవర్తించేది.

కమీషనర్‌గారు గాని, కొడుకులుగాని బజారు నుంచి వస్తుంటే వాళ్ళకి ఎదురుగా వెళ్ళి స్వాగతం చెప్పటం టైగర్‌కు ఉగ్గుపాలతో పెట్టిన విద్య. లేనప్పుడు రాణికి రాజకీయాలు చెప్పేది మన 'ఆహార సమస్య', 'ఏయుద్ధం' పరిస్థితి, చైనా

దురాక్రమణ—అన్నీ దానికి తెలుసు. ఈ రెండేళ్ల నుంచి రేడియోలో న్యూస్ వినటం అలవాటు చేసుకుంది. ఉదయం 7 గం. కి రాత్రి 7 గం కి అది రేడియోముందు కూర్చునేది. యుగయుగాల భారతీయాత్మ దానిలో ఆవేశించింది నలభైనాలుగు కోట్ల భారతీయుల సమస్యలు దానికి కావలసి వచ్చాయి.

ఎప్పుడైనా కమీషనర్‌గారింట్లో టైగర్‌మీద కోపం వచ్చి గేటు మూసివేస్తే అది గేటు కటకటాలలో తలపెట్టి జాలిగా చూసేది పళ్లతో కటకటాలను కొరకాలని చూసేది. మధ్యలో ఉన్న కంతలో తల దూర్చి జాలిగా అరిచేది. గేటు తీయించటానికి రాణిని గేటుదాకా పిలిచి మంతనాలాడేది. బయటకు వచ్చిన ప్రతి వారితో గేటు తీయించమని తన భాషలో చెప్పేది.

రోజు రాత్రిపూట అది ఆరు బంగళాల మధ్యలో పడుకునేది. చీమ చిటుక్కుమన్నా లేచి చీకట్లో చూపుల సూదులు గుచ్చేది కాని కన్ను మూసేదికాదు. దాని భయంకరమైన అరుపు విని ఆ ప్రాంతాలకి ఎవరూ వచ్చేవాళ్ళు కాదు రాత్రి డ్యూటీకి వచ్చే పోలీసులకు కూడ అదంటే భయమే. రోజూ వచ్చే గూర్ఖా దాని అరుపు విని 'మహారాజ్ రాం రాం' అని పరుగు పెట్టేవాడు.

అందుచేత దాని నిత్య పాలనకి అడ్డు అనేది లేకుండా పోయింది.

*) * *

సూర్యబింబము గర్భంలో ఉన్నందువల్ల తూర్పు దిక్కు పావురాల కూతలతో ప్రసవవేదన పడుతోంది. టైగర్ బద్ధకంగా లేచి ఒళ్లు విదిలించుకుని ఇంజనీర్‌గారింటికి బయలుదేరింది ఇంట్లో అంతా బిజీగా కనిపించారు. రోజు మాదిరిగా ఎవరూ దాన్ని 'హలో టైగర్' అని విష్ చేయలేదు. రోజు లభించే బిస్కట్లు ఈరోజు లభించలేదు దానికి ఇంజనీరుగారి ఆఖరి కుమార రత్నం కమల్‌కు స్నేహం వాడు అది ఇంట్లోకి వచ్చిన తరువాత పుట్టాడు. వాడు అస్తమానం టైగర్‌తో ఆడుకునేవాడు. అలాటివాడు కూడ దాన్ని చూడ లేదు. చూసినా పలకరించలేదు వాడి స్వంత ఆస్తులైన బొంగరం, గోలీలు, బంతులు, బొమ్మల పుస్తకాలు సంచీలో సర్దుకోటంలో నిమగ్నుడైనాడు. ఇంజనీరుగారి భార్య పెట్టెలు సర్దుతూంది. టైగర్ తలెత్తి నిశితంగా చాల సేపు చూసింది. ఇక పలకరించరని తెలిసాక తనే వెళ్ళి ఒరిగచుట్టూ ఒకసారి తిరిగి తన భాషలో 'గుడ్ మార్నింగ్' అంది —దాని మొరుగు విని ఉలిక్కిపడి వెనక్కి చూసింది. తన ప్రయత్నం ఫలించినందుకు టైగర్ ఆనందించింది అయితే ఆవిడ విష్ చేయటానికి బదులుగా "పోవే బాబు, కాసేపు వాకిట్లోకి పో. మా కడ్డంరాకు." అని కసురుకుంది

టైగర్‌కి ఆ మాటలు అంతగా బోధపడక పోయినా ఆ భావం గ్రహించింది. అయినా దానికి ఆగ్రహం రాలేదు. మామూలుగా ఉండే చిరాకే ననుకుంది. వాకిట్లోకి వచ్చి తన చోటులో కదలకుండా పడుకుంది.

ఇలాంటి మానావమానాలు ఎన్నో అది సహించింది. "పెట్టిన చెయ్యే కొడుతుంది" ని దానికి తెలుసు అప్పుడప్పుడు వారి సరదా కోసరం పెద్ద దెబ్బలే తిని బాధపడింది. అయినా అప్రయత్నంగా వచ్చిన కన్నీటిని వాళ్ల నవ్వుతో కలిపి ఆనంద భాష్పంగా మార్చుకుంది.

అలా ఎంతోసేపు పడుకోలేదు. ఓసారి ఇంటి చుట్టూ తిరిగి వచ్చింది. రోజులాగ లేదు ఇల్లు. ఈరోజు ఇల్లు తల్లక్రిందులుగా కనిపించింది దానికి.

"టైగర్ ! కమాన్ టైగర్" యజమాని మాటలు అమృతం చిలికినయి దాని గుండెల్లో.

ఒక్క ఉరుకులో పరుగెత్తుకుని వచ్చింది. యజమాని ప్రక్కన మరో మనిషి కూడ ఉన్నాడు. దురదృష్ట మేమిటంటే టైగర్‌కి పేపరు చదవటం రాదు. వచ్చిఉంటే ఈరోజు దాని నక్షత్రంలో నమ్మినవారి నుంచి ద్రోహం అని చదివి ఉండేది.

యజమానిని చూసి తోకాడిస్తూ నిల్చుంది.

"ఆఁ, వచ్చావా, ఒరే చిట్టి ఏది గొలుసు."

చిట్టి అనబడే ఆఖరి కుమార రత్నం మనసులు కట్టుకున్న బంధాన్ని త్రెంపటానికి ఇనుపగొలుసు తెచ్చాడు.

యజమాని గొలుసు మెడలో బెల్టుకు తగిలిస్తుంటే ఆనందంగా మెడ నందించింది.

వాళ్ళిద్దరూ మాట్లాడుతూ బయలుదేరారు.

తరువాత యజమాని చేతిలో గొలుసు కొత్తాయన చేతిలోకి మారింది.

యజమాని వెనుదిరిగాడు. టైగర్ కంగారు పడింది. భయంకరంగా మొరిగింది.

యజమాని టైగర్‌ని చూసి "గుడ్‌బై టైగర్" అని వెళ్లిపోయాడు.

టైగర్ శక్తి ఉన్నంతవరకు అరిచింది. కొత్తాయన మీదికి దూకింది. రక్కటానికి ప్రయత్నించింది అయితే వీపుమీద దెబ్బలమీద దెబ్బలు పడటంతో వెనక్కి తగ్గింది.

క్రొత్తాయన ఓ వ్యాపారస్తుడు. ఈమధ్య ఆయన దుకాణంలో ఓ దొంగతనం జరిగింది. ఆయన టైగర్ ప్రశస్తి విన్నాడు. దాన్ని కొన్నాడు. సరిగా అదే సమయంలో ఇంజనీర్‌గారికి ట్రాన్స్‌ఫర్ కావటం టైగర్ దురదృష్టం. ఈ సంగతులు దానికెవరు చెబుతారు ?

కాని దాని వూహ నిజం ! తనని అమ్మే హక్కు ఇంజనీరుగారి కేముంది ? కేవలం వాళ్లింట్లో తిన్నందుకు కావలి కాస్తోంది. తను ఆ యింటికి చెందుతుంది కాని, అందులో మనుష్యులకు కాదు. అయినా అది ఇంజనీరుగారిని ద్వేషించలేక పోతున్నది. దాని కోపమల్లా ఆ కొత్తాయన మీదనే. సందు దొరికితే ఆయన్ని చీల్చివేయాలని చూస్తున్నది అయితే ఆయన ప్రతిసారి చేతిలో హంటర్‌తోనే కనిపించాడు.

ఆపూట అది వాళ్ళు పెట్టిన అన్నం తినలేదు. దానికి ఓ వ్యక్తిత్వం ఉంది. దానికి అహం ఉంది అది అందరు పెట్టిన అన్నం తినదు. దానికి ఉచ్ఛ నీచలు తెలుసు. ఆకలితో బాధ పడుతూ ప్రతిక్రియ ఆలోచించింది ఇంజనీరుగారి అబ్బాయితో తన ఆటలు తలుచుకుని ఏడ్చింది ? మళ్లీ ఎప్పుడు అలా రాణితో గ్రౌండులో తిరగటం ? మళ్లీ ఎప్పుడు ఆ ఆరు బంగళాలమధ్య పడుకుని అరవటం ?

ఇలా ఆవేశం ఎక్కువైనకొద్దీ ఆకలి ఎక్కువైంది. ఆకలి ఎక్కువైనకొద్దీ ఆవేశం ఎక్కువైంది. విపరీతమైన బలంతో విజృంభించి గుంజుకుంది. మెడకున్న బెల్టు గొలుసునుండి విడిపోయింది. ఒక్క పరుగులో వీధిలో పడింది. దాన్ని పట్టగల శక్తి అక్క డెవరికీ లేకపోయింది.

అది సరాసరి ఇంజనీర్‌గారింటికి పోయింది. కాని, అంతకన్నా వేగంగా దురదృష్టం దాన్ని వెంటాడింది. ఇల్లు తాళం పెట్టిఉంది. అది అరుస్తూ తాళం పట్టుకుంది. తాళం వెక్కిరిస్తూ నవ్వింది. టైగర్ తెలుసుకుంది యజమాని లేడని. గృహం శూన్యమైందని. టైగర్ స్టేషన్‌కి పరుగెత్తిపోయింది.

సరిగా అదే సమయానికి రైలు బయలుదేరుతోంది. టైగర్ అరుస్తూ పిచ్చిగా, ఆత్రంగా ఓమూల నుంచి ఈమూలకి పరుగెత్తి రైలు పెట్టెలన్నీ చూసింది.

"అదిగో టైగర్" అంటున్నాడు చిట్టి.

టైగర్ చూసింది. ఆనందంతో అరిచింది.

రైలు వెనకే పరుగెత్తింది.

చిట్టి దాన్ని చూసి చెయ్యి వూపుతున్నాడు. కాని ఎంతోసేపు అలా పరుగెత్తలేకపోయింది.

దేవుని సృష్టి మానవుని సృష్టిని అతిక్రమించలేక పోయింది. అది రైలుకన్న వెనకపడింది. రైలు కనుచూపుమేర దాటిపోయింది.

అది గుండెలు పగిలేలా రోదిస్తూ నిలుచుంది. దాని మనస్సులో ఎన్నో భావాలు. ఏమిటీ వంచన? ఇప్పుడేం చేయాలి ? కొత్తాయన యింటికి పోవటం యిష్టంలేదు దాని దృష్టిలో కమీషనర్‌గారు మెరుగు. అవును. తను పోగొట్టుకున్న ఆదరణ అక్కడ లభించవచ్చు.

అది వెనక్కి తిరిగి బయలుదేరింది.

కాని అక్కడ కొత్త యజమాని నిలబడి ఉన్నాడు

అది నిర్ఘాంతపోయింది. పారిపోదా మనుకుంది. దాని కాళ్ళలో శక్తి చచ్చిపోయింది.

ఆయన చేతిలో హంటర్ ఉంది ప్రతిఫలం దానికి తెలుసు దానికి తల వంచే ఉంది. గొలుసుకు బెల్టు తగిలించే లాక్కుపోయినాడు క్రూరముగా. టైగర్‌కి పోక తప్పలేదు. ఇంత కఠిన శిక్షకి తను ఏ తప్పు చేసింది ?

ఈ లోకంలో దాన్ని రక్షించటానికి ఏ 'లా' పుట్టలేదు. అది విధికి కట్టుబడి పోయింది.

దాని గుండెలో పరాభవాగ్ని రగుల్కొన్నది.

"జాగత్తగా కట్టెయ్యిరా ! మళ్లీ పోతుంది." ఎవరో అంటున్నారు.

"ఈసారి పోతేనా ?"

ఈ మాటలు టైగర్‌కి అర్థంకాలేదు కాని యజమాని క్రూరమైన చూపు దానిగుండెని చీల్చివేసింది అది దాని జీవితంలోని అర్థాన్ని పరమార్థాన్ని దహించివేసింది. కొన్ని కలలకి రూపమేకాని అర్థముండదు. ఇది అలాటిదే.

దాని బాధ ఒకటే !

కనీసం రాణీ అయినా తను వెళ్లేటప్పుడు చూడ లేదు. కాని, దానికేం తెలుసు ? ఈ సమయంలో

తన అంశ ఆరు విభాగాలు చూసి నూతన ప్రాణులను సృష్టించిందని ?

టైగర్ ఈరోజు పూర్తిగా ఓడిపోయింది.

దాని అంతర జగత్తులో యుద్ధం తీవ్రమైంది. కొత్త యజమాని టైగర్‌ని తీసుకుని బయలుదేరాడు తన స్వంత వూరుకి. ఆయన్ననుసరించక తప్పలేదు దానికి. అయితే అది యిష్టంతో కాదు. పాత యజమానిని అనుసరించినట్లుగా కాదు. మధ్య మధ్య ఎదురుతిరిగి

ఆశాజీవి

రెండు దెబ్బలు తిన్నది. దాని కళ్ళవెంబడి అశ్రుపుష్పాలు భూదేవిని పూజిస్తున్నాయి. బహుశ పాత యజమానికి తన మార్గం చూపిస్తున్నదేమో ?

అయినా దాని గుండెల్లో ఆశ. అది తలెత్తి చూస్తూనే ఉంది పాత యజమాని కోసరం. ఇది కలగా తీసికుని తృప్తిపడటం చేతకావటంలేదు దానికి. మానవుడు తన దురదృష్టాన్ని విధి మీదకి నెట్టి తృప్తిపడ్డాడు.

దానిలో చైతన్యం లేదు. దానికి ఉనికి లేదు. ఆశల ఆకులన్నీ రాలిపోగా మోడైన వృక్షము దాని జీవితం. అది జీవితంలో స్థిరత్వాన్ని ఏనాడో కోల్పోయింది. దాని ఆత్మలోంచి ఒక ఆర్తనాదం వెలువడి జగద్వ్యాప్తమైపోయింది. దాని గుండెల్లో రైలు చప్పుడు ఇంకా వినబడుతూనే ఉంది. క్షణక్షణానికి వాళ్ళిద్దరి మధ్యదూరం ఎక్కువైతూనే ఉంది.

అయినా ఆశ హిమాలయం వంటిది. దానితోనే అది ముందడుగులు వేసింది. కాలపుటిసుకపై దాని చరిత్ర పాద చిహ్నాలు పడుతున్నాయి.

రాణి సంగతి తెలిసినా అది తృప్తిపడేదేమో ?

ఒక్కసారి దాని జీవితం సున్నం కొట్టిన సమాధి అయింది. దాని కర్మబీజం దగ్ధమైంది.

దాని గొంతులోంచి ఆర్తరవాలు ప్రకృతిని నిగ్గదీస్తున్నాయి. ప్రకృతి జీవంలేని నవ్వు నవ్వింది. అది కుక్కగా జన్మించినప్పుడే దాన్ని మరొకరికి బానిస చేశాడు భగవంతుడు. దానిమీద దానికి లేని హక్కు మానవుల కుంది. అది న్యాయాన్యాయాలను, మానావమానాలను స్వీకరించక తప్పదు. అయితే దాని అహం ఎదురు తిరుగుతూనే ఉంటుంది. దానికి బలం లేదు. మానవుడి నిరంకుశత్వానికి బలియైపోయిన ఓ జీవి. అది తల్లక్రిందులైనా మానవుడు దానవుడు కాగా వాడి చేతిలో ఓ అల్పప్రాణి.

ఇలా అన్ని కోణాలలోంచి తన జీవన వీణని తీగెలు తెంచివేస్తుందని దానికేం తెలుసు ?

మానవుడు దేవుడు కాకపోయినా దానవుడు కాకుండా తన స్మృతిని కాల పుటల మీద నుంచి చెరిగిపోకుండా నిలుపుకుని మానవుడుగానైనా మరణిస్తాడని అనుకుంది టైగర్. కాని, మనిషిని మనిషే మనిషిగా చూడని ఈ కాలంలో తనని సరిగా చూడగలడని, తన ఉనికిని గుర్తించగలడని అనుకోవటమే టైగర్ చేసిన తప్పు. అందుకే అతన్ని వెర్రిగా నమ్మింది. ఈరోజు మానవుడు తల్లక్రిందులుగా నడుస్తున్నాడని దానికి తెలియదు.

అయినా దానిది మొండి ప్రాణం. దానికి బ్రతుకుమీద ఆశ ఉంది.

ప్రకృతి విధించిన ఈ దారుణ శాపాన్ని వరంగా మార్చమని మాత్రమే అది దేవుణ్ణి ప్రార్థించింది.

అప్పుడప్పుడు సడిలేని నడిరేయి ఆకాశంలో మెరిసే నక్షత్రాల వంక చూస్తుంటే దానికి దిగులు ఆవరించేది. దాని గొంతులో నుండి వేదనా భరితమైన వాదం ఆవిర్భవించి దిగ్వ్యాప్తమైపోయేది. ★

వీరి
ఉజ్వల భవిష్యత్తు
ఇప్పుడే
నిర్ణయింపబడుతున్నది



ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు రికరింగ్ డిపాజిట్ పదతిలో
పొదుపుచేసిన మొత్తం ద్వారా
కనీసం రూ. 5/- నుండి అదనంగా దాని గుణములలో
రూ. 500/- వరకు డిపాసిట్లు పుచ్చు కొనబడును.

ప్రతినెలా డిపాసిట్ చేయబడు మొత్తమైన
రూ. 5/- రూ.10/- రూ. 50/- రూ. 100/- రూ. 500/-
క్రింద కనపరచినట్లు పెరుగును:

12 నెలలలో	రూ. 61.00	రూ.122	రూ. 610	రూ.1,220	రూ. 6,100
24 నెలలలో	„ 124.50	„ 249	„ 1,245	„ 2,490	„ 12,450
36 నెలలలో	„ 192.00	„ 384	„ 1,920	„ 3,840	„ 19,200
48 నెలలలో	„ 262.00	„ 524	„ 2,620	„ 5,240	„ 26,200

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ లిమిటెడ్

ప్రధాన కార్యాలయము: 151, మౌంట్‌రోడ్, మద్రాస్-2

మీకు సేవచేయుటకొరకు 100 టికి పైబడిన బ్రాంచి ఆఫీసులు ఇండియాలోని ముఖ్యమైన చోట్లలో గలవు. వీటిలో తమిళ దేశంలో మాత్రం 60 కి పైబడిన బ్రాంచి ఆఫీసులు గలవు.

ఏమ్. సిటి. ముత్తయ్యా
చేర్మన్

కె. ఎం. నంజప్ప
జనరల్ మానేజర్

IOB-17-SA